క్లుప్తంగా

విద్యార్థుల ప్రతిభ

పెంట్లవెల్లి: మండల కేంద్రంలో జ్ఞాన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో నిర్వహించిన సైన్స్ చెకుముకి ప్రతిభ పరీక్షలో గోపులాపురానికి చెందిన విద్యార్థులు జీవిత, శ్రావ్య మండల స్థాయిలో ప్రథమ స్థాయిలో ప్రతిభ చాటారు. ఇందుకుగాను విద్యార్థులకు పాఠశాల ఉపాధ్యాయులు ప్రశంసాపత్రాలు అందజేసి సత్కరించారు. ప్రధానోపాధ్యాయులు గురునాథ్‌రావు, ప్రవీణ్, ప్రగతి, ప్రతాప్ పాల్గొన్నారు.

నేడు మండల సమావేశం

ఉప్పునుంతల: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం ఉదయం 10.30 గంటలకు ప్రత్యేక మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ లక్ష్మణ్‌రావు మంగళవారం ఒక ప్రకటనలో తెలియజేశారు. ఎంపీపీ తిప్పర్తి అరుణ అధ్యక్షతన నిర్వహించే సమావేశంలో మండలంలోని ప్రజాప్రతినిధులు పాల్గొనాలని కోరారు.

షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణానికి భూమిపూజ

నాగర్‌కర్నూల్ రూరల్: మండల పరిధిలోని తూడుకుర్తిలో మంగళవారం ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం కార్యాలయ భవనం, షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణానికి ఆ సంఘం అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ నిర్మలా శ్రీనివాస్, ఉపసర్పంచ్ కర్నాకర్, మాజీ ఉపసర్పంచ్ రఫియొద్దీన్, డైరెక్టర్లు అనంతయ్య, తిరుపతయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆస్పత్రి భవనం ప్రారంభం

కల్వకుర్తి రూరల్: మండలంలోని గుండూరులో రూ.20 లక్షలతో నిర్మించిన ఆస్పత్రి భవనాన్ని మంగళవారం సర్పంచ్ కిష్టారెడ్డి ప్రారంభించారు. అయితే ఎమ్మెల్యేకు ఇతర ప్రజాప్రతినిధులకు సమాచారం ఇవ్వకుండా భవనాన్ని ఎలా ప్రారంభిస్తారని కాంగ్రెస్ నాయకులు వాగ్వాదానికి దిగి అడ్డుకునే ప్రయత్నం చేశారు. ఎట్టకేలకు సర్పంచ్ కిష్టారెడ్డి భవనాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. పశువుల ఆస్పత్రి భవనం రైతులకు సేవలందిస్తుందన్నారు. ఎంపీటీసీ సభ్యుడు నర్సిరెడ్డి, సింగిల్‌విండో డైరెక్టర్ కృష్ణగౌడ్, పర్వత్‌రెడ్డి పాల్గొన్నారు.

టీఎస్‌యూటీఎఫ్ మండల కమిటీ ఎన్నిక

చారకొండ/ వెల్దండ: మండల కేంద్రంలోని ఎమ్మార్సీ కార్యాలయంలో టీఎస్‌యూటీఎఫ్ ఉపాధ్యాయ సంఘం మంగళవారం సమావేశం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా జిల్లా అధ్యక్షుడు కృష్ణ, చిన్నయ్య, ఎంఈఓ శంకర్‌నాయక్ హాజరై మాట్లాడారు. ఉపాధ్యాయుల సమస్యలపై నిరంతరం యూనియన్ అనేక పోరాటాలు చేస్తుందన్నారు. అనంతరం వెల్దండ మండల కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా నాగభూషణం, ప్రధాన కార్యదర్శిగా రవి, కోశాధికారిగా వెంకటయ్య ఎన్నికయ్యారు. చారకొండ మండల గౌరవ అధ్యక్షుడిగా అంజయ్య, అధ్యక్షులుగా మహిపాల్ నాయక్, ఉపాధ్యక్షులుగా మాదవిని ఎన్నుకున్నారు.

ఆర్థిక సాయం అందజేత

తాడూరు: మండలంలోని తుమ్మలసూరుకి చెందిన అనిత ఉన్నత చదువులకు, ఆమెతో పాటు ఎంబీబీఎస్ చదువుతున్న మరో విద్యార్థినికి క్లాస్‌మేట్ ఆధ్వర్యంలో రిటైర్డ్ పీఈటీ రాంచంద్రారెడ్డితో పాటు మీనా మంగళవారం రూ.15 వేల ఆర్థిక సాయం అందజేశారు.

బిల్లులు చెల్లించాలి

కల్వకుర్తి రూరల్: గ్రామాల అభివృద్ధి కోసం సర్పంచ్‌లు సొంత నిధులు ఖర్చు చేసి చేసిన పనులకు మిగిలిపోయిన నిధులను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని కల్వకుర్తి మండల సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు ఎముక జంగయ్య కోరారు. మంగళవారం కల్వకుర్తిలో విలేకరులతో మాట్లాడారు. గతంలో సర్పంచ్‌లు కాంట్రాక్టర్ అవతారం ఎత్తి ప్రతి పని చేశారన్నారు. చేసిన పనులకు సకాలంలో కొన్ని బిల్లులు రాక ఇబ్బందులు పడ్డారన్నారు. బిల్లుల చెల్లింపుపై డిక్లరేషన్ ఇవ్వాలని కోరారు.

ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన



అమ్రాబాద్: ఆంధ్రప్రదేశ్ గ్రామీణ వికాస్ బ్యాంకు ఆధ్వర్యంలో పదర మండలం మద్దిమడుగు, ఇప్పలపల్లి, ఉడిమిళ్ల గ్రామాల్లో మంగళవారం కళాకారులు ఆర్థిక, అక్షరాస్యతపై అవగాహన కల్పించారు. ప్రధానమంత్రి జన్‌ధన్‌తో పాటు బ్యాంకులకు వచ్చే పథకాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో బ్యాంకు మేనేజర్ బాల్‌రాజు, కౌన్సిలర్ సురేష్ తదితరులు ఉన్నారు.

సోషల్ మ్యాప్‌తో..

తెలకపల్లి: మండల పరిధిలోని పర్వతాపూర్‌లో పాలెం కేవీకే రావేఫ్ విద్యార్థులు గ్రామస్తులకు, రైతులకు అవగాహన కల్పించారు. గ్రామీణ భాగస్వామ్య విశ్లేషణాత్మక కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థులు సోషల్ మ్యాప్, వనరుల పటం ద్వారా రైతులకు గ్రామంలోని వనరులు వాటి సద్వినియోగంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో విద్యార్థులు ద్వారకామయి, విశ్వతేజ, అనూజ, శ్వేత, సుభద్ర, డాక్టర్ ప్రభాకర్‌రెడ్డి, ప్రోగ్రాం కోఆర్డినేటర్ డాక్టర్ రాజశేఖర్‌రెడ్డి, శైల పాల్గొన్నారు.

గాంధీ సేవలు చిరస్మరణీయం

నాగర్‌కర్నూల్, అచ్చంపేట, కల్వకుర్తి, కొల్లాపూర్ నియోజకవర్గ కేంద్రాలు, మండలాలు, గ్రామాల్లోని పాఠశాలలు, రాజకీయ, ప్రజాసంఘాల నాయకులు, ప్రభుత్వ కార్యాలయాల్లో మహాత్మా గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. 76 వర్ధంతిని నిర్వహించారు.

- మహాత్మాగాంధీ దేశానికి చేసిన సేవలు చిరస్మరణీయమని ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ అన్నారు. అచ్చంపేటలో ఘన నివాళి అర్పించారు.
- సమాజంలో నేటి యువత మహాత్మా గాంధీ సిద్ధాంతాలను ఆదర్శంగా తీసుకోవాలని, గ్రామ స్థాయిలో ప్రజలకు సేవా కార్యక్రమాలు నిర్వహించాలని జిల్లా యువజన మరియు క్రీడా శాఖాధికారి సీతారాం యువతకు పిలుపునిచ్చారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో తెలంగాణ గాంధీ స్మారక నిధి, వాసవ్య రూరల్ డెవలప్‌మెంట్ సొసైటీ హైదరాబాద్, వివేకానంద వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మహాత్మా గాంధీ 76వ వర్ధంతి నిర్వహించారు.
- మన్ననూర్ ప్రభుత్వ ఆస్పత్రిలో రోగులకు పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేశారు.
- తాడూరు మండలంలోని తుమ్మలసూరుకు చెందిన రిటైర్డ్ వ్యాయామ ఉపాధ్యాయుడు రాంచంద్రారెడ్డి పాఠశాల విద్యార్థులకు నోట్‌పుస్తకాలు, స్టడీ మెటీరియల్ అందజేశారు.

– 'సాక్షి' నెట్‌వర్క్



అచ్చంపేటలో నివాళి అర్పిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ, నాయకులు



తాడూరులో పుస్తకాలు అందజేస్తున్న ఉపాధ్యాయులు



కల్వకుర్తిలో..



కొల్లాపూర్‌లో ఆర్యవైశ్య సంఘం నాయకులు



పెద్దకొత్తపల్లి మండలం పెద్దకార్పాములలో..



జూపల్లిలో..



పదరలో..

విద్యతోనే ఉజ్వల భవిష్యత్



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి

కల్వకుర్తి: విద్యతోనే ఉజ్వల భవిష్యత్ సాధ్యమని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. మంగళవారం కల్వకుర్తి పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నిర్వహించిన కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. విద్యార్థుల జీవితాల్లో ఇంటర్మీడియట్ అనేది ఎంతో ముఖ్యమైందన్నారు. ఉన్నత స్థాయి చదువులకు ఇంటర్ విద్య మూలస్తంభం అన్నారు. ప్రతి విద్యార్థి పాఠశాలల్లో ఉపాధ్యాయులు బోధించే పాఠాలను ఏకాగ్రతతో వింటే అది వారికి ఎంతో మేలు చేస్తాయన్నారు. కళాశాలలో నెలకొన్న అన్ని సమస్యల పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానని చెప్పారు. సీఎం సహకారంతో కల్వకుర్తి నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తానని అన్నారు. తమకు ప్రతినెల వేతనాలు వచ్చేలా చూడాలని గెస్ట్ లెక్చరర్లు ఎమ్మెల్యేకు వినతి అందజేశారు. విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరిని అలరించాయి. కళాశాల ప్రిన్సిపాల్ సురేందర్‌రెడ్డి, మాసుధాకర్, వెంకటేశ్వర్‌గౌడ్, ప్రసన్న, తదితరులు పాల్గొన్నారు.

పోషకాహారం తీసుకోవాలి



పెద్దకొత్తపల్లి: విద్యార్థుల్లో రక్తహీనత లేకుండా అవసరమైన పోషక ఆహారాన్ని తీసుకోవాలని డాక్టర్ సుఫియాన్‌బైగ్ అన్నారు. మండల కేంద్రంలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలల్లో మంగళవారం ఎనీమియ ముక్త భారత్ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు వైద్యపరీక్షలు నిర్వహించి అవసరం ఉన్న వారికి ట్యాబ్‌లెట్లను అందజేశారు. ఆర్‌బీఎస్‌కే టీం డాక్టర్ సుఫియాన్‌బైగ్ మాట్లాడుతూ.. విద్యార్థులు వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పోషకాహారాలు ఉన్న ఆహారాన్ని తీసుకుంటే రక్తహీనతను తగ్గించుకోవచ్చని సూచించారు. గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ అకుల్, మెడికల్ ఆఫీసర్ విజయ్, రమణమ్మ, రమేష్ పాల్గొన్నారు.

గ్రామాల్లోని సమస్యలు పరిష్కరిస్తాం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాజేష్‌రెడ్డి

నాగర్‌కర్నూల్ రూరల్: నియోజకవర్గంలోని అన్ని గ్రామాల్లో ప్రజలు నిత్యం ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని నాగర్‌కర్నూల్ ఎమ్మెల్యే కూచుకుళ్ల రాజేష్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండల పరిధిలోని పెద్దముద్దునూరులో ఏర్పాటు చేసిన రైతువేదిక, వైకుంఠధామంతో పాటు తన సొంత నిధులతో ఏర్పాటు చేసిన బోరుమోటారును ప్రారంభించి మాట్లాడారు. గ్రామంలో సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని సూచించారు. గ్రామంలో రూ.3 కోట్లతో సీసీరోడ్ల నిర్మాణాలకు నిధులు కావాలని మాజీ ఎంపీటీసీ రమణరావు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. విడతల వారీగా నిధులు సమకూర్చి గ్రామంలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ స్వామి, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

ఐదుగురికి తీవ్ర గాయాలు

మన్ననూర్: శ్రీశైలం–హైదరాబాద్ ప్రధాన రహదారిలో రెండు వాహనాలు ఎదురెదురుగా ఢీకొన్న సంఘటనలో కారులో ప్రయాణిస్తున్న ఐదుగురు వ్యక్తులకు తీవ్ర గాయాలైన సంఘటన సోమవారం రాత్రి చోటు చేసుకుంది. అమ్రాబాద్ మండలం ఈగలపెంట పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. హైదరాబాద్‌కు చెందిన తిల్మని నరేందర్ కుటుంబ సభ్యులు శ్రీశైలం పుణ్యక్షేత్రానికి వెళ్లి తిరుగు ప్రయాణంలో ఉన్నారు. ఈ క్రమంలో మన్ననూర్ నుంచి శ్రీశైలం వైపు వెళ్తున్న బొలెరో గూడ్స్ వాహనం వటువర్లపల్లి సమీపంలో ఎదురెదురుగా ఢీ కొన్నాయి. దీంతో కారులో ప్రయాణిస్తున్న ఐదుగురికి తీవ్ర గాయాలు కావడంతో 108 అంబులెన్స్‌లో అచ్చంపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. బొలెరో వాహనం డ్రైవర్ మరియ బాబు మద్యం తాగి అజాగ్రత్తగా వాహనం నడపడంతోనే ప్రమాదం జరిగిందని, కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలియజేశారు.

యాజమాన్య పద్ధతులు పాటించాలి



క్షేత్రస్థాయిలో అవగాహన కల్పిస్తున్న శాస్త్రవేత్తలు

తెలకపల్లి: సామూహిక మేలైన యాజమాన్య పద్ధతులు పాటించాలని ప్రోగ్రాం కోఆర్డినేటర్ డాక్టర్ టి. ప్రభాకర్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండల పరిధిలోని పర్వతాపూర్‌లో కృషి విజ్ఞాన కేంద్రం పాలెం ఆధ్వర్యంలో క్షేత్రస్థాయిలో సామూహిక వేరుశనగ సాగుపై క్షేత్రదినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా కేవీకే ఆధ్వర్యంలో నిర్వహించిన అవగాహన సదస్సులో సామూహిక వేరుశనగ సాగుపైన రైతులకు పూర్తి స్థాయిలో అవగాహన కల్పించారు. శాస్త్రవేత్తల బృందం ప్రభాకర్‌రెడ్డి, రాజశేఖర్, శైల, ఆదిశంకర్, భార్గవసాగర్ పాల్గొన్నారు.

వివాహిత అదృశ్యం

వెల్దండ: మండల కేంద్రంలో ఈ నెల 28న వివాహిత మంజుల(38) అదృశ్యం కావడంతో ఆమె తండ్రి మాద్గుల అంజయ్య ఫిర్యాదు మేరకు మంగళవారం కేసు నమోదు చేసినట్లు ఏఎస్‌ఐ శ్రీనివాసులు తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి. ఊర్కొండ మండలం రాచాలపల్లికి చెందిన అంజయ్య తన కుమార్తెకు ఆరోగ్యం బాగోలేకపోవడంతో వెల్దండలో నాటువైద్యం చేయించాడు. తిరిగి గ్రామానికి వెళ్లడానికి తండ్రి అంజయ్య కుమార్తెతో కలిసి బస్టాండ్‌కు వచ్చాడు. మంజుల దాహం వేస్తుందని చెప్పడంతో షాపువద్ద వాటర్ బాటిల్ తీసుకొచ్చేందుకు వెళ్లి వచ్చే సరికి బస్టాండ్‌లో కుమార్తె కనిపించలేదు. బంధువుల ఇళ్లలో వెతికినా ఆచూకీ లభించలేదు. దీంతో మంగళవారం వెల్దండ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్‌ఐ తెలియజేశారు.

కాంగ్రెస్‌లోకి మున్సిపల్ కౌన్సిలర్లు

కల్వకుర్తి టౌన్: కల్వకుర్తి మున్సిపాలిటీలోని ఇద్దరు కౌన్సిలర్లు కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. మంగళవారం హైదరాబాద్‌లోని ఎమ్మెల్యే నివాసంలో కాంగ్రెస్ పార్టీ కౌన్సిలర్లు, పలువురు పట్టణ ప్రజాప్రతినిధుల మధ్య ఎమ్మెల్యే వారికి పార్టీ కండవా కప్పారు. మున్సిపల్ పరిధిలోని తిమ్మరాశిపల్లి వార్డు కౌన్సిలర్ రవీందర్ స్వతంత్ర అభ్యర్థిగా, 20వ వార్డు నేరటి పద్మ కాంగ్రెస్ పార్టీ గుర్తుపై గెలుపొందిన అసెంబ్లీ ఎన్నికల సమయంలో టీఆర్‌ఎస్‌కి అనుబంధంగా ఎన్నికల్లో ప్రచారం చేశారు. వీరిద్దరూ కాంగ్రెస్ పార్టీలో చేరటంతో కాంగ్రెస్ కౌన్సిలర్ల సంఖ్య 10కి పెరిగినట్లయ్యింది. దీంతో అవిశ్వాసానికి సంబంధించి ఏమైన పావులు కదుపుతున్నారా అనే విషయం పట్టణంలో జోరుగా చర్చ జరుగుతుంది.

కుష్టు నిర్మూలనకు కృషి

తాడూరు: కుష్టు నిర్మూలనకు కృషి చేయడంతో పాటు గ్రామాల్లో ప్రజలకు అవగాహన కల్పించాలని డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ వెంకటదాసు అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో జాతీయ కుష్టు నిర్మూలనలో భాగంగా ర్యాలీ నిర్వహించి ప్రతిజ్ఞ చేశారు.

పెంట్లవెల్లి: మండల కేంద్రంలో జెడ్పీహెచ్‌ఎస్ బాలుర పాఠశాలలో కుష్టు నివారణ దినోత్సవం సందర్భంగా ప్రాథమిక వైద్యశాఖ సిబ్బంది విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. అంతే కాకుండా కుష్టుపై అవగాహన కల్పించారు. చర్మంపై మచ్చలు, స్పర్శ లేకుండా ఉండటం, వ్యాధిగ్రస్తులకు ఆస్పత్రిలో చికిత్స లభిస్తుందన్నారు.

పార్లమెంట్ టికెట్ మాదిగలకే కేటాయించాలి

కొల్లాపూర్ రూరల్: కాంగ్రెస్, బీఆర్‌ఎస్, బీజేపీ, బీఎస్పీ తదితర అన్ని పార్టీలు నాగర్‌కర్నూల్ పార్లమెంట్ టికెట్ మాదిగలకే కేటాయించాలని దళిత సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం పట్టణంలో విలేకరులతో మాట్లాడారు. నాగర్‌కర్నూల్ పార్లమెంట్ నియోజకవర్గంలో దాదాపుగా మాదిగల ఓట్లు 2.50లక్షలు ఉన్నాయన్నారు. అన్ని పార్టీలు ఆలోచించి వచ్చే పార్లమెంట్ ఎన్నికలకు అభ్యర్థులను మాదిగలనే ఎంపిక చేయాలన్నారు. సమావేశంలో నాయకులు లక్ష్మయ్య, ఎల్లయ్య, నిరంజన్, రామకృష్ణ, మద్దిలేటి, సురేష్ పాల్గొన్నారు.

నిత్యావసర సరకుల పంపిణీ

లింగాల: మండల కేంద్రంలోని ఆర్డీటీ కార్యాలయంలో మంగళవారం అనాథలు, వృద్ధులకు పౌష్టికాహారంతో కూడిన నిత్యావసర సరుకులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆర్డీటీ ఏటీఎల్ రాధ మాట్లాడారు. లింగాల, బల్మూర్, కొల్లాపూర్, పెద్దకొత్తపల్లి మండలాలకు చెందిన 77 మంది అనాథలు, వృద్ధులకు 6 నెలలకు సరిపడా నిత్యావసర సరుకులను పంపిణీ చేశామని చెప్పారు. సంవత్సరంలో రెండు సార్లు సరకులు ఇస్తున్నట్లు చెప్పారు. తీసుకున్న సరుకులను సద్వినియోగం చేసుకోవాలని లబ్ధిదారులకు సూచించారు. కార్యక్రమంలో ఆర్డీటీ సిబ్బంది పాల్గొన్నారు.



బినామీ డీలర్లు తక్షణమే తొలగిపోవాలి

లింగాల: రేషన్‌షాపులను నిర్వహిస్తున్న బినామీ డీలర్లు తక్షణమే తొలగిపోవాలని తహసీల్దార్ ఉమ సూచించారు. మంగళవారం తహసీల్దార్ కార్యాలయంలో మండల రేషన్ డీలర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ షాపుల నిర్వహణపై డీలర్లకు తగు సూచనలు, సలహాలు ఇచ్చారు. లైసెన్సు కలిగిన డీలర్లు మాత్రమే షాపులను నిర్వహించాలని సూచించారు. సమయపాలన పాటిస్తూ వినియోగదారులకు ఇబ్బందులు కలుగకుండా చూడాలన్నారు. ముఖ్యంగా తమ లైసెన్సులను రెన్యూవల్ చేయించుకోవాలని, బియ్యం పక్కదారి పట్టకుండా చూసుకోవాలని తెలిపారు. ప్రతి షాపు దగ్గర షాపు నెంబర్‌తో పాటు పేరు రాయించాలని తెలియజేశారు.

మరో నాలుగు గ్యారంటీలు అమలు చేస్తాం..



నాగులపల్లి తండాలో నూతన గ్రామపంచాయతీ భవనాన్ని ప్రారంభిస్తున్న మంత్రి జూపల్లి

కోడేరు: కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే రెండు గ్యారంటీ పథకాలు అమలు చేసిందని రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. మంగళవారం మండలంలోని నాగులపల్లి తండాలో ఎస్‌డీఎఫ్ నిధులు రూ.20 లక్షలతో నూతనంగా నిర్మించిన గ్రామపంచాయతీ భవనాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. మరి కొన్ని రోజుల్లో నాలుగు గ్యారంటీ పథకాలను అమలు చేసి తీరుతామన్నారు. పార్టీలకు అతీతంగా కలిసిమెలిసి పని చేయాలని, గ్రామాల అభివృద్ధికి తోడ్పడాలని అన్నారు. మాజీ ఎంపీపీ కొత్త రాంమోహన్‌రావు, ఝాన్సీ, రవి, దేవమ్మ, మహేశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కలిసికట్టుగా అభివృద్ధికి పాటుపడాలి



రైతువేదికను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి

ఊర్కొండ: ప్రజాప్రతినిధులు, అధికారులు కలిసికట్టుగా అభివృద్ధికి పాటుపడాలని జడ్చర్ల ఎమ్మెల్యే జనుంపల్లి అనిరుధ్‌రెడ్డి అన్నారు. మంగళవారం ఆయన మండలంలో చేపట్టిన పలు అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించారు. ముందుగా ఊర్కొండపేటలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సర్పంచ్ అనితతో కలిసి ప్రారంభించారు. అలాగే మహాత్మాగాంధీ, బీఆర్ అంబేద్కర్ విగ్రహాలకు పూలమాల వేసి నివాళి అర్పించారు. అనంతరం డీఎస్‌ఆర్ యువసేన ఆధ్వర్యంలో నూతనంగా ఏర్పాటు చేసిన హైమాస్ట్ లైట్లను, రాచాలపల్లిలో నూతనంగా నిర్మించిన రైతువేదిక, సెగ్రిగేషన్ షెడ్, పల్లె ప్రకృతి వనం, గుడిగానిపల్లిలో సీసీ రోడ్లను ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. మండల అభివృద్ధికి తనవంతు సహకారం అందిస్తానని చెప్పారు. విజయమ్మ, వెంకటయ్యగౌడ్, నిఖిల్‌రెడ్డి, తిరుపతిరెడ్డి, వీరస్వామి, అబ్దుల్ సమి, రమేష్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

అభయాంజనేయస్వామి ఉత్సవ కమిటీ ఎంపిక

ఊర్కొండ: ఊర్కొండపేట అభయాంజనేయ స్వామి ఆలయ బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని ఎమ్మెల్యే జనుంపల్లి అనిరుధ్‌రెడ్డి సమక్షంలో జడ్చర్లలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో మంగళవారం ఉత్సవ కమిటీని ప్రకటించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకొని ప్రశాంత వాతావరణంలో బ్రహ్మోత్సవాలు నిర్వహించాలని సూచించారు. అనంతరం ఉత్సవ కమిటీ సభ్యులుగా చింతల మనోహర్‌రెడ్డి, నర్సిరెడ్డి, రమేష్ నాయక్, చుక్కాపురం అంజయ్యగౌడ్, మ్యాకల సువర్ణ, మొండేళ్ల అశోక్, పి.గోపాల్, వట్టం వెంకటయ్య, పోలె లక్ష్మమ్మ, గుండ్లపల్లి అలివేల, కొమ్మగోని సంగప్పగౌడ్, కప్పెర చంద్రయ్య, గుండమోని మల్లేష్, దత్తాత్రేయశర్మలను నియమించారు.

టీఎన్‌జీఓ క్యాలెండర్ ఆవిష్కరణ



రాష్ట్ర రైతు సంఘం డైరీని ఆవిష్కరిస్తున్న ఏడీఏ రమేష్‌బాబు

కొల్లాపూర్: టీఎన్‌జీఓ క్యాలెండర్లను మంత్రి జూపల్లి కృష్ణారావు మంగళవారం కొల్లాపూర్‌లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఉద్యోగులు ప్రజలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా చూడాలని సూచించారు. అంతకు ముందు మంత్రి తెలంగాణ మాదిగ దండోరా డైరీలను ఆ సంఘ వ్యవస్థాపక అధ్యక్షుడు మీసాల రామన్న సమక్షంలో ఆవిష్కరించారు. సత్యనారాయణయాదవ్, జీకే.వెంకటేష్ పాల్గొన్నారు.

వడ్డెర సంఘం..

పెద్దకొత్తపల్లి: మండల వడ్డెర సంఘం క్యాలెండర్‌ను తహసీల్దార్ యూసుఫ్ అలీ మంగళవారం కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. సమాజంలో వడ్డెర సంఘం వారు ఇళ్ల నిర్మాణం కోసం అవసరమున్న రాళ్లను తీసిచ్చి వారి సేవాభావాన్ని చాటుకుంటున్నారని అన్నారు. కుర్మయ్య, జయరాజు, తిరుపతయ్య, వెంకటస్వామి, లింగస్వామి పాల్గొన్నారు.

ఏఐకేఎస్ డైరీ..

నాగర్‌కర్నూల్ రూరల్: తెలంగాణ రాష్ట్ర రైతుసంఘం(ఏఐకేఎస్) 2024 సంవత్సరానికి సంబంధించిన డైరీని నాగర్‌కర్నూల్ సహాయ సంచాలకుడు(ఏడీఏ) గణేష్‌బాబు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రాష్ట్ర రైతు సంఘం కార్యదర్శి వార్ల వెంకటయ్య మాట్లాడారు. ప్రభుత్వం రైతులకు తక్షణమే రైతుబంధు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఏఓ నర్మద, నీతి, కృష్ణాజీ, బాలమురళి, మధుగౌడ్ పాల్గొన్నారు.

కార్మికులందరికీ కనీస వేతనం ఇవ్వాలి



వినతి అందజేస్తున్న బీసీ సంఘం నాయకులు

నాగర్‌కర్నూల్ రూరల్: మున్సిపల్ శాఖలో పని చేస్తున్న కార్మికులందరికీ రాష్ట్ర ప్రభుత్వం రూ.26 వేల కనీస వేతనం ఇవ్వాలని ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి వనంపల్లి జైపాల్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి ఎం.శివశంకర్‌తో కలిసి మున్సిపల్ కమిషనర్‌కు వినతి అందజేశారు. ఈ సందర్భంగా 2024 ఫిబ్రవరి 16న జరిగే రాష్ట్ర వ్యాప్త సమ్మెను మున్సిపల్ కార్మికులు, ఇతర కార్మిక సంఘాల నాయకులు పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. రాష్ట్రంలో మున్సిపల్ కార్మికులందరిని పర్మనెంట్ చేయాలని, కార్మికులు విధినిర్వహణలో మరణిస్తే మరణించిన కార్మికుడి కుటుంబానికి రూ.25 లక్షల పరిహారం కార్మికులకు సహాయ సహకారాలు అందించాలని డిమాండ్ చేశారు. ఏఐటీయూసీ నాయకులు మారేడు శివశంకర్, శేఖర్, ఆంజనేయులు, బాలపీరు తదితరులు పాల్గొన్నారు.

వార్షిక పరీక్షలకు కష్టపడి చదవాలి



నృత్య ప్రదర్శనలో విద్యార్థినులు

కొల్లాపూర్: పట్టణంలోని ఆర్‌ఐడీ ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో వార్షికోత్సవ వేడుకలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. కళాశాల విద్యార్థినులు నృత్యాలు చేస్తూ, సాంస్కృతిక ప్రదర్శనలతో ఉత్సాహంగా వేడుకల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ నరేందర్‌గౌడ్ మాట్లాడారు. విద్యార్థినులు వార్షిక పరీక్షల కోసం కష్టపడి చదవాలని సూచించారు. అధ్యాపకులు వినయ్‌కుమార్, శ్రీనివాసరావ్, దశరథరాము, కురుమూర్తి పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

తెలకపల్లి: అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్‌ను పోలీసులు పట్టుకుని కేసు నమోదు చేశారు. హెడ్‌కానిస్టేబుల్ పరశురాములు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండల పరిధిలోని నడిగడ్డ అనుబంధ గ్రామామైన గుడివెనక రామగిరికి చెందిన మద్దెలబండ మల్లేష్ తన ట్రాక్టర్‌పై మంగళవారం దుందుభి వాగు నుంచి ఎలాంటి అనుమతి లేకుండా ఇసుకను తరలిస్తున్నాడు. పోలీసులు పట్టుకుని ట్రాక్టర్‌ను స్వాధీనం చేసుకుని సీజ్ చేసి మల్లేష్‌పై కేసు నమోదు చేశామని తెలియజేశారు.

సీసీ కెమెరాల ప్రారంభం

వెల్దండ: మండల పరిధిలోని నారాయణపూర్‌లో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను మంగళవారం రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. గ్రామాల్లో చోరీలు జరిగినప్పుడు సులువుగా దొంగలను గుర్తించవచ్చన్నారు. ఇటీవల గ్రామంలో 8 ఇళ్లలో గుర్తు తెలియని వ్యక్తులు చోరీలకు పాల్పడినట్లు తెలియజేశారు. అలాంటి సంఘటనలు చోటుచేసుకోకుండా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవడం అభినందనీయమన్నారు.